

నేడు యథావిధిగా స్పందన

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం – స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

చీనీ ధరలు పతనం

- ఆందోళనలో రైతన్నలు
- సూట్ పేరుతో మోసం
- ఈ సీజన్‌కైనా పులివెందులలో మార్కెట్ ప్రారంభమయ్యేనా?

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈ ఏడాది సీజన్‌లో చీనీ కాయల ధరలు అమాంతంగా తగ్గిపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చీనీ తోటలు పెంపకానికి ప్రసిద్ధి. ఈ మండలంలో దాదాపు 8 వేల హెక్టార్లలో పంట సాగులో ఉంది. ప్రతి ఏడాదీ ఈ సీజన్‌లో దాదాపు 80 వేల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ధరలు గణనీయంగా పడిపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం, బెంగళూరు మార్కెట్లలో టన్ను ధర రూ. 20 వేల నుంచి రూ. 25 వేల లోపే ధరల్లో పలుకుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ ధరలకు చీనీకాయలు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడులు సైతం రావని రైతులు ఆవేదన చెందుతున్నారు.




పులివెందుల మార్కెట్‌పై రైతుల ఆశలు

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో గత ఏడాది చీనీకాయల మార్కెట్ అటహాసంగా ప్రారంభించారు. అనతి కాలంలోనే రైతులకు సరైన ధరలు లభించకపోవడంతో తమ ఉత్పత్తులను తీసుకెళ్లకపోవడంతో మార్కెట్‌లో వ్యాపారాలు నిలిచిపోయాయి. ఈ ఏడాది లోకల్ వ్యాపారులను కాకుండా ప్రముఖ కంపెనీలను ఆహ్వానించి వారిచేత చీని కాయలు కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సూట్ పేరుతో మోసపోతున్న రైతులు

రైతులు తమ తోటల వద్ద చీనీ కాయలు విక్రయించాలంటే ప్రతి పది టన్నులకు 2.5 టన్నులు సూటు పేరుతో ఉచితంగా వ్యాపారులకు ఇవ్వాల్సి వస్తుంది. ఈ సూట్‌ను నియంత్రించడానికి పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు సూటు నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సూట్ నియంత్రించేలా చర్యలు చేపట్టాలి

అధికారులు, రాజకీయ నాయకులు చీనీ కాయల కొనుగోలులో సూట్ నియంత్రించేలా చర్యలు తీసుకోవాలి. సూటు పేరుతో వ్యాపారులు మోసం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

-గంగాధర్‌రెడ్డి, చీనీ రైతు, గురజాల.

కనీస మద్దతు ధర ప్రకటించాలి

టన్ను చీనీ కాయలు కనీసం మద్దతు ధర రూ. 50 వేలు ప్రకటించాలి. దీంతో పెట్టుబడులు పోను కొంతమేర ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. కావున ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

-గోపాల్ రెడ్డి, చీని రైతు, గురజాల.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా...

ప్రస్తుతం మార్కెట్లో చీనీ కాయలు ధరలు తక్కువగా ఉన్నాయి. అదేవిధంగా కొనుగోలులో సూట్‌ను నియంత్రించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలాగా చూస్తా.

-మల్లేశ్వర్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి, ముద్దనూరు.

ఉత్తమ వైద్య కళాశాలగా తీర్చిదిద్దుతా

- ఈ ఏడాది నుంచి అదనపు పీజీ కోర్సులు
- ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుకు అనుమతి
- ఒకటి నుంచి యుజి, ఐదు నుంచి పీజీ తరగతులు
- జిజిహెచ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిజిహెచ్ వైద్యకళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ఆధునిక కోర్సులకు అనుమతి మొదలు ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, పెరిగిన మెడికల్ సీట్ల నేపథ్యంలో జిజిహెచ్ వైద్యకళాశాల అభ్యున్నతికి నిదర్శనం. దీంతోపాటు వైద్యవిద్యార్థుల బోధన, బోధనేతర అవ సరాలు, వసతి సదుపాయాల కల్పనపై దృష్టి సారించాం. వైద్య ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన విధానాలను అమలు చేయడంపై దృష్టి సారిస్తాం. ఫలితంగా నిపుణులైన వైద్యనిపుణులను అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. 2006లో రిమ్స్ పేరుతో ఏర్పా టైన వైద్య కళాశాల అంచెలంచెలుగా కోర్సులను, ప్రమాణాలను పెంచుకుంటూ ఎదుగుతున్న క్రమాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్న జిజిహెచ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖతో ప్రజాశక్తి ముఖాముఖి.



ముఖా ముఖి..

యుజి, పీజీ కోర్సుల వివరాలు తెలపండి?

ప్రభుత్వ జనరల్ వైద్య కళాశాలలో ఇడబ్ల్యుఎస్ కోటాను అమలు చేసిన నేపథ్యంలో 2023–24 అకడమిక్ ఇయర్‌లో 175 ఎంబిబిఎస్, 113 పీజీ సీట్లు ఉన్నాయి.

కొత్త కోర్సుల అమలుపై మాట్లాడండి?

2023–24 అకడమిక్‌ఇయర్‌లో 11 కొత్త కోర్సులను ప్రవేశపెట్టనున్నాం. ఈమేరకు లెటర్ ఆఫ్ పర్మిషన్ లభించింది. ఇందులో ప్రధానంగా బయోకెమిస్ట్రీ, పాథాలజీ, ఫర్మకాలజీ, ఎస్‌పిఎం, ఫోరెన్సిక్ మెడిసిన్, ఫల్మనరీ మెడిసిన్, రేడియోలజీ, సైక్రియాట్రీ, రేడియో ఆంకాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

యుజి, పీజీ తరగతులు ప్రారంభమెప్పుడు?

జిజిహెచ్ వైద్యకళాశాలలో సెప్టెంబర్ ఒకటి నుంచి ఎంబి బిఎస్, ఐదు నుంచి పీజీకోర్సులను తరగతులను ప్రారంభించనున్నాం. ఈమేరకు అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడమైంది.

ఆధునిక పరికరాల ఏర్పాటు గురించి చెప్పండి?

జిజిహెచ్ వైద్య కళాశాలకు కొత్త కోర్సుల అమలు నేపథ్యంలో డిసెంబర్ నాటికి ఆధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేయనున్నాం. ఇందులోభాగంగా బ్రాచిథెరఫీ, టెలిథెరఫీ, రేడియేషన్ సాఫ్టీ పరికరం, సైరోమీటర్, లైట్‌సోర్స్, ఫ్లోరో స్కోపీ యూనిట్, మెమోగ్రఫీ డిజిటల్ యూనిట్ మొదలగు పలు ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయనున్నాం.

వైద్యకళాశాల అభివృద్ధిపై మాట్లాడండి?

జిజిహెచ్ వైద్యకళాశాలలో 11 కొత్త కోర్సులకు అనుమతి లభించడం మొదలుకుని సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్‌కేర్, సైక్రియాట్రీ బ్లాకుల నిర్మాణంతో 130 బెడ్స్ అందుబాటులోకి రానున్నాయి. దీంతోపాటు 160 మంది వైద్యులు, ఇతర సిబ్బంది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

వసతి సదుపాయాల గురించి తెలపండి?

జిజిహెచ్ విద్యార్థులకు కొత్త రెసిడెన్సియల్ హాస్టల్‌లో వసతి సదుపాయాల కల్పనపై దృష్టి సారించడమైంది. మూడవ ఫ్లోర్ లోని మూడు దశలుగా 21 గదుల చొప్పున 63 గదుల్లో వసతి సదు పాయాలను కల్పించడమైంది.

హర్ ఘర్ తిరంగా సంబరాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని జిఆర్‌టి ఉన్నత పాఠశాలలో ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా సంబరాలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మునిగోల కృష్ణ, కార్యదర్శి వి.ఎం.నాగరాజు, ట్రెజరర్ ఉస్మాన్ సాహెబ్, గౌరవాధ్యక్షులు మునిరత్నమయ్య, ఉపాధ్యక్షులు జగన్మోహన్, శకుంతలమ్మ, ఆర్గనైజర్ కరుణాకర్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్.మునిగోపాల కృష్ణ మాట్లాడుతూ ఘర్ తిరంగా సంబరాలను పురస్కరించుకొని ఈనెల 13,14,15 తేదీల్లో ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగరవేసి స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు నిర్వహించుకోవాలని చెప్పారు. త్రివర్ణ పతాకం ఎగురవేయడం భారతీయులందరికీ గర్వకారణమన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కార్యదర్శి వి.ఎం.నాగరాజు నివేదికను చదివి వినిపించారు .ట్రెజరర్ ఉస్మాన్ సాహెబ్ జమ, ఖర్చులు చదివి సభ్యుల ఆమోదం పొందారు. అనంతరం మునిరత్నమయ్య, జగన్మోహన్, ప్రొఫెసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, సరస్వతమ్మ స్వాతంత్ర దినోత్సవంపై ప్రసంగించారు. ఇందులో భాగంగా ప్రముఖ నవలా రచయిత టిఎస్ఎ కృష్ణమూర్తి రచించిన భయం లేని బ్రతుకు నవల ఎంతో అద్భుతంగా ఉందని కితాబునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ కృష్ణ కుమార్, రామచంద్రయ్య, ఆర్గనైజర్ కరుణాకర్, ధనలక్ష్మి, సరస్వతమ్మ, మనోహరమ్మ, ఉపాధ్యక్షులు రమణ కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్స్

నేల తల్లికి నమస్కారం

ఆజాదికా అమృత మహోత్సవంలో భాగంగా మదనపల్లి పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు మువ్వన్నెల జెండాల చేతపట్టుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆర్ గురు ప్రసాద్, ప్రిన్సిపల్ ఆర్ రమాదేవి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన స్వాతంత్ర సమరయోధులతోపాటు, దేశ రక్షణకు సరిహద్దుల్లో నిరంతరం శ్రమిస్తున్న సైనికులను గుర్తుంచుకోవాలన్నారు. పచ్చదనం పెంచి మన దేశాన్ని హరిత భారతదేశంగా మార్చుకుందామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ సిటిఎం రోడ్, పటేల్ రోడ్డు మీదుగా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు మునీంద్ర నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యుల రక్షణ చట్టాన్ని పటిష్ట పరచాలి

రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో వైద్యులు, ఆసుపత్రుల సమస్యల పరిష్కరిష్కారానికి ప్రభుత్వమే కృషి చేయాల్సిన అవసరం ఉందని ఐఎంఎ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ తెలిపారు. ఆదివారం పట్టణంలోని బికెఆర్ రెసిడెన్సీలో పీలేరు ఐఎంఎ శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి. ఫణిధర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు డాక్టర్ ఏవి సుబ్బారెడ్డి, డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడారు. భారతీయ వైద్య సంఘం (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ప్రపంచంలోనే అతి పెద్ద వృత్తి సంఘంగా గుర్తింపు పొందిందన్నారు. మన రాష్ట్రంలో 98 ఐఎంఎ శాఖలుండగా వాటిలో 20 వేల మందికి పైగా సభ్యులున్నారని చెప్పారు. ఐఎంఎ అంటే ప్రయివేట్ వైద్యుల సంఘం అనే అపోహ ఉందని, ఇందులో ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో సేవలు అందిస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో ఆసుపత్రులు, వైద్యులపై భౌతిక దాడులు పెరిగుతున్నాయని, వైద్యులు తమ వైద్య సేవలు నిర్భయంగా, స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను తక్షణం తీసుకు రావలసిన అవసరం ఉందని అన్నారు. ఆసుపత్రుల్లో రోగులు చనిపోయిన సందర్భాల్లో, చికిత్స లోపాలను చూపుతూ వైద్యులపై వైద్య నిర్లక్ష్యం కేసులు నమోదు చేసే సమయంలో సుప్రీంకోర్టు తీర్పు పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. ముగ్గురు వైద్య నిపుణుల కమిటీ ప్రాథమిక ఆధారాలున్నాయని నిర్ధారించిన తర్వాతే కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తూ, ఆరోగ్యశ్రీ పరిధిని మరింత విస్తృతం చేసి, అన్ని రకాల జబ్బులను ఇందులో చేర్చడం, కోలుకునే సమయంలో ఆర్థిక సహాయం ఇవ్వడం ద్వారా రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యున్నత స్థాయి వైద్యం అందిస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ శాఖ తరపున ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటుకు ఇస్తున్నట్లుగా ఆసుపత్రుల ఏర్పాటు చేసుకునేందుకు కూడా రాయితీలు ఇవ్వడం ద్వారా ఉన్నత స్థాయి ప్రమాణాలతో ఆసుపత్రులను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో ఉన్నత సేవలు అందించిన వైద్యులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు ప్రవేశపెట్టాలని సూచించారు సమావేశంలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి. ఫణిధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మనోరంజన రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్య దర్శులు డాక్టర్ సుబ్బా రెడ్డి, డాక్టర్ విజయ్ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి.కె ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ సుబ్బా రావు, పీలేరు ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ పి. చంద్రశేఖర్, కార్యదర్శి పవన్ కుమార్, కోశాధికారి బి. ఈశ్వర సురేంద్ర, డాక్టర్ రాజా సాహెబ్, డాక్టర్ టి.వి.ఎస్.ఆర్.కె.వి ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ రూపేష్ కుమార్ రెడ్డి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడతున్న రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

పంచాయతీరాజ్ మినీస్టీరియల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్ నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయ సభాభవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సర్వ సభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు రెండు కళ్లు లాంటి వారన్నారు. త్వరలో రాష్ట్రంలోని 13 జిల్లాల జడ్‌పి చైర్మన్ల సమావేశాన్ని నిర్వహిస్తామని, చైర్మన్లందరూ కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అంతకు మునుపు సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగి ఉంటారన్నారు. ఇందులో భాగంగానే జడ్‌పి కారుణ్య నియామకాలు మొదలు జీతాల చెల్లింపుల సమస్యల ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కరోనా మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొని దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పంచాయతీరాజ్ మినీస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాధరెడ్డిని శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ మినీస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి, బసిరెడ్డితోపాటు బాలుడు, సురేష్, చంద్ర, సోమశేఖర్ సహా రాష్ట్రలోని వందలాది మంది నాయకులు, ఉద్యోగులు పాల్గన్నారు.



జడ్‌పి చైర్మన్‌ను సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా మేసా ప్రసాద్

కడప సిటీ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఏపీ మెడికల్ అండ్ హెల్త్ (YSRTUC) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేసా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యవర్గ ఎన్నికల్లో వైఎస్ఆర్ జిల్లాకు చెందిన మేసా ప్రసాద్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా కాకర్ల వెంకటరామిరెడ్డిని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర అధ్యక్షులు వెంగల్‌రెడ్డి వైయస్సార్ జిల్లా అధ్యక్షులు వి.ఎన్. మునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ.చంద్రమోహన్, యూనియన్ నాయకులు వల్లి భాష,నాగరాజు , మహదేవ్ యాదవ్ , ఆంజనేయ వరప్రసాద్ , ఖాదర్ భాషా , విశ్వనాథరెడ్డి, లక్కిరెడ్డిపల్లె రవి, రవీంద్ర , జేష్టకుమార్, భాస్కర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.



భాగ్యమ్మను పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర నాయకులు రమాదేవి

ఐద్వా నాయకురాలికి పరామర్శ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని విజయనగరం కాలనీలో ఐద్వా నాయకురాలు భాగ్యమ్మ కుమారుడు విజయ్ కుమార్ (26) అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబాన్ని ఆదివారం సిపిఎం రాష్ట్ర నాయకురాలు రమాదేవి, అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు, నాయకులు టి. హరేంద్రనాథ్ శర్మ, ఎన్.చంద్రలు మదనపల్లెకు చేరుకొని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐద్వా నాయకురాలు భాగ్యమ్మ కుమారుడు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పారు.

18న రాష్ట్ర స్థాయి ఉక్కు సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఉక్కు సాధన కోసం కడప ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో డివైఎఫ్ఐ యువజన సంఘం జిల్లా కమిటీ అధ్వర్యంలో ఈనెల 18న రాష్ట్ర స్థాయి ఉక్కు సదస్సు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ తెలిపారు. ఉక్కు సదస్సు పోస్టర్లు ఆదివారం స్థానిక జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు పైన కేంద్ర ప్రభుత్వం సీత కన్ను వేసింది అన్నారు. ఇక్కడి ప్రాంత యువత భవిష్యత్ కడప ఉక్కు అన్నారు. యువతకు భవిత కోసం కడప ఉక్కే ఏకైక పరిష్కారం అన్నారు. కడప ఉక్కును ఆంధ్రుల హక్కుగా కడప వేదికగా డివైఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడుతుందని చెప్పారు. ఈనెల18 న కడప యుటిఎఫ్ భవన్ లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తారని చెప్పారు. ఈ సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్.గేయానంద్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు బి.నారాయణ, మాజీ డివైఎఫ్ఐ నాయకులు జి.చంద్రశేఖర్ హాజరు అవుతున్నారన్నారు. సదస్సుకు కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం. ఓబులేసు, నగర ఉపాధ్యక్షులు విజయ్, జగదీష్ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చిన వారి ఫొటోలు ఇంటిలో పెట్టుకుని పూజిస్తామని వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకి సంఘం ఎపి వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో షటిల్ కోర్టు వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తాము ఇటీవల బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరితో విజయవాడలో కలిసి తమ సమస్యలను విన్న వించామని చెప్పారు. త్వరలో తీపి కబురు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారన్నారు. సమావేశంలో సద్దల జయసింహ, నరసింహులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువయ్యేందుకే వార్డు నిద్ర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజలకు పోలీసు వ్యవస్థ మరింత చేరువయ్యేందుకే వార్డు నిద్ర కార్యక్రమం నిర్వహిస్తునట్లు టూ టౌన్ సిఐ మురళీకృష్ణ తెలిపారు. అన్నమయ్య ఎస్‌పి ఆర్.గంగాధర్ రావు ఆదేశాల మేరకు పట్టణంలోని ఇందిరా నగర్‌లో వార్డు నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వార్డు ప్రజలతో సమావేశం నిర్వహించి సైబర్ క్రైమ్ వల్ల కల్గే అనర్థాలు వివరిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలియజేశారు. ఈవ్ టీజింగ్, ఎక్కడైనా ఆకతాయిలా ఆగడాలకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే తమకు తెలియపరచాలని, అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరికైనా కొత్తవారికి ఇంటిని అద్దెకి ఇచ్చేముందు వారి చిరునామా వ్యక్తిగత వివరాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ మురళీకృష్ణ

29, 30న బికెఎంయు జిల్లా మొదటి మహాసభలు

మదనపల్లె అర్బన్ : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు అన్నమయ్య జిల్లా మొదటి మహాసభలు ఈనెల 29,30 తేదీలలో రైల్వే కోడూరులో నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప తెలిపారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు మదనపల్లి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సిటిఎం గ్రామం ఎస్టీ కాలనీలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న మన రాష్ట్రంలో గ్రామీణ ప్రజల్లో అత్యధికులు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారని, వీరిలో గిరిజనులు దళితులు వెనుకబడిన వర్గాల తదితర పేదలున్నారని చెప్పారు. వారు కరువు కోరల్లో కొట్టుమిట్టాడుతూ అణిచివేతకు గురవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ నాయకులు కె. సిద్దయ్య, ఉమా మల్లేష్, గోపాల్, పాపులమ్మ, రమణమ్మ, కుమారమ్మ, నీలమ్మ, నిర్మల పాల్గొన్నారు.

శ్రీనివాసరాజు చేరికతో పార్టీ బలోపేతం

రాజంపేట అర్బన్ :యల్లటూరు శ్రీనివాసరాజు జనసేన పార్టీలో చేరితే పార్టీ బలోపేతంతో పాటు రాజంపేటలో జనసేన జెండా ఎగుర వేయచ్చని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ కో– ఆర్డినేటర్ కుప్పాల జ్యోతి అన్నారు. ఆదివారం ఎల్లటూరు శ్రీనివాసరాజు ను ఆమె కలిసి త్వరలో పవన్ కల్యాణ సమక్షంలో చేరుతున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీకి యల్లటూరు శ్రీనివాసరాజు సారధ్యం వహిస్తే క్షత్రియ సంఘంతో పాటు కాపు సంఘం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు ఆయనకు మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పట్టణ జనసేన నాయకులు పలుకూరి శంకర్, లతీఫ్ మాట్లాడుతూ శ్రీనివాసరాజు వెంటే తమ రాజకీయ ప్రయాణమని తెలిపారు. ఇలాంటి నాయ కుని కోసం తామంతా ఎదురు చూస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నంద లూరు మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, పి.వి.ఆర్ కుమార్, మౌల, నాసర్ ఖాన్, శింగంశెట్టి సూరి, కట్టారు బాబు, భీమినేని విష్ణు పాల్గొన్నారు.



శ్రీనివాసరాజును సన్మానిస్తున్న జనసేన నాయకులు



బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ముక్కా సాయి వికాస్‌రెడ్డి

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండలంలో చిన్నవరంపాడు గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం సాంబశివ నాయుడు కుమారుడు పవన్‌కుమార్ నాయుడు లివర్ వ్యాధితో మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్న వారి కుటుంబానికి ముక్కా సాయివికాస్‌రెడ్డి రూ.50వేల ఆర్థిక సాయం చేశారు. అంతేకాకుండా వారి కుటుంబానికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామన్న హామీనిచ్చారు. పవన్‌కుమార్ మృతి పట్ల సంతాపంతో పాటు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో నాగశివ శంకర్‌రెడ్డి, రామచంద్ర నాయుడు, గద్దె పెంచలయ్య, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, యార్రబాపు వేణుగోపాల్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, శ్రీనాథం జగదీశ్వర్ రెడ్డి, వెంకటేష్, సురేష్ ముక్కావారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్ పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డిపై హత్యాయత్నం కేసు దారుణం

ప్రజాశక్తి-రామాపురం

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసరెడ్డి పై తప్పుడు కేసులు బనాయించడం దారుణమని రాజంపేట టిడిపి పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు గడిగోట భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామాపురం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 4న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్ల పర్యటన సందర్భంగా జరిగిన అల్లర్లలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులైన శ్రీనివాసరెడ్డిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేయడం దారుణమన్నారు. టిడిపి ప్రజాధరణ ఎక్కువగా ఉందని ఓర్వలేకే శ్రీనివాస్‌రెడ్డిపై కేసు బనాయిస్తున్నారని అవినాష్‌రెడ్డికి దీటుగా రాజకీయంగా ఎదిగి పోటీగా నిలబడి తన స్థానాన్ని ఎక్కడ కోల్పోతాననే భయంతోనే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని చెప్పారు. వైసిపి అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని దీనికి తగిన మూల్యం చెల్లించు కోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంగన్వాడీ కార్యకర్త మృతికి నివాళి

ప్రజాశక్తి-కురబలకోట

మండలం భద్రయ్యగారిపల్లెలో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్త మార్తమ్మ మృతిపట్ల అంగన్వాడీ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కోశాధికారి హరిశర్మలు సంతాపం తెలిపారు. గతకొం తకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మార్తమ్మ(59) శనివారం కన్ను మూశారు. ఆమె భౌతికకాయాన్ని ఆదివారం శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూనియన్‌కు మార్తమ్మ సేవలను కొనియాడారు. ఆమె యూనియన్ కార్యక్ర మాల్లో చాలా చురుకుగా పాల్గొనేవారని, ధర్నాలు నిరసనలవంటి కార్యక్రమాల్లో ముందుండేవారని, యూనియన్ ఐక్యత కు కృషిచేశారన్నారు. ఆమెమృతి అంగన్వాడీ ఉద్యమానికి తీరనిలోటని జోహార్లర్పించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్మిక ర్యాలీలో కూడా మార్తమ్మ పాల్గొన్నారని తెలిపారు.



ఉపాధ్యాయులతో పూర్వపు విద్యార్థులు


పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల కేంద్రమైన ములకలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పూర్వపు విద్యార్థులు 1995-96 సంవత్సరంలో పదవ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకొని సందడి చేశారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో సంతోషాలకు అవధులు లేకుండా పోయింది. పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకుని ఆ తర్వాత పై చదువులకు కొంతమంది వెళ్లడం, ఉద్యోగాలలో స్థిరపడ్డారు. పాఠశాలలో చేసిన అల్లర్లు, పాఠశాలలో తిరిగిన ప్రదేశాలను గుర్తుచేసుకొన్నారు. కుటుంబ విషయాలను నెమరు వేసుకున్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు చిన్ననాటి స్నేహితులతో కలసి సంతోషంగా ముచ్చటించుకున్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన తమ సహచరుల ఆత్మకు శాంతి కలగాలని కొంతసేపు మౌనం పాటించారు. పాఠశాలలో చదువులు నేర్పిన గురువులు ఎస్‌టిజి వరదచార్యులును పూలమాలతో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సమావేశంలో పూర్వపువిద్యార్థులు పఠాన్ ఖాజావలి, జి.నజీర్, పఠాన్ హబీబ్ ఖాన్, ఖాదర్ బాషా, లక్ష్మిరెడ్డి, మధుకర్‌రెడ్డి, రమణ, యామీన్, ఇస్మాయిల్, కేశవాచారి, శీనా, అశోక్, కిషోర్, వెంకటరమణ, రెడ్డిబాషా, సుధాకర, సురేంద్ర, మౌలాలి ఉన్నారు.

సుప్రజకు కేంద్ర హోం శాఖ అవార్డు

ప్రజాశక్తి-నందలూరు




అవార్డుకు ఎంపికైన సుప్రజ (ఫైల్ ఫొటో)

గుంటూరు రూరల్ అడిషనల్ ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న నందలూరుకు చెందిన కొర్లగుంట సుప్రజను కేంద్రహోంశాఖ అవార్డుకు ఎంపిక చేశారు. 2023వ సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా140 పోలీసులకు కేంద్రం అవార్డులు ఇవ్వనుంది. ఇందులో రెండు తెలుగురాష్ట్రాల నుంచి పదిమందిని ఎంపిక చేశారు. ఎపి నుంచి ఐదు మందిని ఎంపిక చేశారు. వీరిలో కొర్లగుంట సుప్రజకు ఈ అవార్డు దక్కనుంది. ఎఎస్‌పి సుప్రజ అవార్డుకు ఎంపిక కావడం పట్ల శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, దర్శకుడు తోట వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన కస్తూర్బా విద్యార్థులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అంతర్ జిల్లాల షూటింగ్ పోటీల్లో మండలం కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినీలు సత్తా చాటారు. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బి.శారదమ్మ, టి.రమ్యశ్రీలు మూడో స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాల ప్రిన్సిపల్ విశ్వలత, పిఇటి సౌభాగ్యవతిలు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాలెం డిఎల్ఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 6వ ఎడిషన్ షూటింగ్ బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు 3వ స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో షూటింగ్ బాల్ క్రీడలో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రతిభ చాటిన విద్యార్థులు

ప్రశ్నార్థకంగా ఖరీఫ్ సాగు

ముఖం చాటేసిన వరుణుడు
ఆకాశానికేసి చూస్తున్న అన్నదాతలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలో అడపాదడబా చినుకులే తప్ప భారీ స్థాయిలో వర్షాలు కురవకపోవడం, చెరువుల్లో చుక్కనీరు లేకపోవడంతో పంటలు సాగు చేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో రైతులు ఎక్కువుగా అరటి, వరి, బొప్పాయి అధికంగా పండిస్తూ ఉంటారు. ఖరీఫ్ సీజన్లో భాగంగా రైతులు నెలరోజుల క్రితం నారువేశారు. ఇప్పుడు అది ఎదిగి నాట్లకు సిద్ధమైంది. వరి నారులు వేపుగా పెరిగి ఉన్నాయి. వాతావరణం చల్లగా ఉండటంతో చిరుజల్లులు కురుస్తుండడంతో ఖరీఫ్ వరి సాగుకు రైతులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. వారం రోజులుగా వరుణుడి జాడ లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. కొన్ని గ్రామాలలో నీటి శాతం కూడా అడుగంటిపోయింది. పడమట గాలి వలన బోరులో ఉన్న నీరు కూడా తగ్గిపోయింది. వర్షపాతం నమోదైతే తప్ప వరి నాట్లు సాగు చేయలేమని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలకు వేలాది రూపాయలు ఖర్చు చేసి వ్యవసాయం చేస్తున్నప్పటికీ పంట చేతికి వచ్చే సమయంలో ఏదో ఒక రూపంలో బలవుతున్నాడని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కోసం రైతులు ఆకాశం వైపు ఎదురు చూపులు చూస్తున్నారు.

పనుల్లేక అల్లాడుతున్నాం

సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయ కూలీ పనులు లేక అల్లాడుతున్నాం. ఏడాది జూన్, జూలై నెలల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో చేతినిండా పని ఉండేది. రూ.250 నుంచి 300 రూపాయల వరకు కూలీ ఇచ్చి భోజనం పెట్టేవారు. ఉపాధి హామీ పనులకు వెళితే సకాలంలో కూలీలు అందక ఇబ్బందులు పడుతున్నాం.

-కొమ్ము వెంకటరమణ, వ్యవసాయ కూలీ, చాపల దళితవాడ



బీడుగా మారిన వ్యవసాయ భూమి

అనుకున్న స్థాయిలో వర్షం కురువలేదు

అనుకున్న స్థాయిలో కురవలేదు. జూన్, జూలై మాసాలలో వేయాల్సిన అరటి, బొప్పాయి తోటలను వర్షాల్లేక సాగు వెను కబడి పోయింది. అరకొర వచ్చిన పంటలకు సరైన గిట్టుబాటు ధర విలవిలలాడి పోతున్నాం. వర్షాలు పడక, పండిన పంటకు గిట్టుబాటు ధర లేక సమస్యలతో కొట్టు మిట్లాడుతున్నాం.



– ఒంటిమిట్ట
శంకరయ్య, రైతు, చాపల దళితవాడ

నాణ్యతతో పనులు చేయాలి : 'మేడా'



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని ముడుముపాడు గ్రామపంచాయతీలో పింఛ జలాశయ మట్టికట్ట తెగిపోవడంతో జరుగుతున్న నిర్మాణ పనులను ఆదివారం రాజంపేట ఎమ్మెల్యే మేడ మల్లికార్జున్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పింఛా ప్రాజెక్ట్ కింద సుమారు 3వేల ఎకరాలు సాగునీరు అందేదని, ప్రాజెక్టు కట్ట తెగిపోవడం రైతులకు తీరని నష్టం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో పనులు పూర్తి చేసి రైతులకు రైతులకు సాగునీరు అందించాలన్నారు. తాగునీటికి సైతం ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురు కావడం బాధాకరమన్నారు. సెప్టెంబర్ నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అన్నమయ్య, పింఛా జలాశయాలకు భూమి పూజ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ఇస్మాయిల్, సర్పంచ్ ఆకుల శ్రీనివాసులు, కో-ఆప్షన్ కలీంబాషా, వైసిపి నాయకులు శ్రీనివాసులురెడ్డి, మైనార్టీ నాయకులు రహీంబాషా, మహేశ్వర్‌రెడ్డి, జయరాంనాయుడు, సచివాలయ కన్వీనర్ మజాహర్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సేవా కార్యక్రమాలు చేయడంలో తెలుగుదేశంపార్టీ ఎన్ఆర్ఐలు ఎల్లప్పుడూ ముందుంటున్నారని రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ అన్నారు. ఆదివారం అమెరికా, టెక్సాస్ రాష్ట్రంలోని ఇర్వింగ్‌లో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికైన కొణిదల లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందించి అభినందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నారై లోకేష్ మదనపల్లి ప్రాంతానికి చేస్తున్న సేవలను కొనియాడారు. గత డిసెంబర్ నెలలో తానా తరపున మదనపల్లెలో నిర్వహించిన పలుసేవా కార్యక్రమాలలో లోకేష్ పోషించిన పాత్ర గణనీయమైనదని పేర్కొన్నారు. ఆయన ఎంతోమందికి మహిళలకు కుట్టుమిషన్లు, వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారన్నారు. పలు ప్రాంతాలలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించారని తెలిపారు. భవిష్యత్తులో కూడా తానా తరపున లోకేష్ చొరవ చూపి మరింతగా కార్యక్రమాలు చేయాలని అయన ఆకాంక్షించారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చేందుకు ఎన్ఆర్ఐ మరింత తోడ్పాటును అందిస్తారని చెప్పారు.



కొణిదల లోకేష్‌ను అభినందిస్తున్న ఆర్.జె.వెంకటేష్

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు : ఎమ్మెల్యే



ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా


ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ఆదివారం అగ్రహారం పంచాయతీలోని ఆరిపిరెడ్డిగారిపల్లి, పూలవాండ్లపల్లి, చింతపర్తివారిపల్లి, చెరువుముందరపల్లి గ్రామాలలో సర్పంచ్ వి.ఉషారాణి, వైసిపి నాయకులు యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్ బాషా పాల్గొన్నారు. ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్ రెడ్డి, స్థానిక వైసిపి నాయకులతో కలిసి ప్రతి ఇంటిలోని లబ్ధిదారులను పలకరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదలకు, రైతులకు, మహిళలకు అండగా నిలబడే ప్రభుత్వమని అన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నా పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో ఎక్కడికి వెళ్లినా నేడు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ వారి ఇంటికి ఆహ్వానిస్తున్నారని అన్నారు. ప్రతి కుటుంబం దాదాపుగా ఐదు లక్షల రూపాయల వరకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిందని తెలిపారు. మంచి చేసిన జగనన్న ప్రభుత్వానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ప్రజల స్వచ్ఛందంగా తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, చంద్రాయుడు, మహదేవరెడ్డి, ఎంపిటిసి కుసుమ, నాయకులు దయాకర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, సుధాకర, నరేంద్ర రెడ్డి, హేమంత్, శశిధర్ రెడ్డి, మౌలాలి, తహశీల్దార్ ఆర్.మంజుల, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.


రూ.వంద కోట్ల లావాదేవీలు నిర్వహిస్తాం

ప్రజాశక్తి-గాలివీడు

కడప సహకార కేంద్ర బ్యాంక్ రూ.100 కోట్ల లావాదేవుని టార్గెట్ రీచ్ చేస్తామని గాలివీడు డిసిసిబి బ్యాంక్ మేనేజర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మూడు సంవత్సరాల క్రితం ఈ బ్రాంచ్‌కు తాను బదిలీపై రావడంతో రూ.3.8 కోట్లు ఉన్న టర్నోవర్‌ను ఇప్పటికీ రూ. 21 కోట్లల్లో బంగారు రుణాలపైనే ప్రాఫిట్ ఉందన్నారు. ఎల్‌డి రుణాలు, వ్యవసాయ రుణాలు రూ.30 కోట్లు, వంద గ్రూపుల మహిళలకు ఐఎల్‌జి గ్రూపులకు రుణాలు ఇచ్చామని హౌసింగ్ రుణాల పైన 62 కోట్ల ఇచ్చామని బంగారు రుణాల పైన ఎక్కువ రుణాలు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో నెంబర్ వన్ బ్యాంకుగా గాలివీడు శాఖ అభ్యున్నతి చెందుతూ ఉందన్నారు. ప్రజలు, వ్యాపారస్తులకు బ్యాంకు సహకారం అందిస్తోందని, తమ సిబ్బంది కృషి వల్ల బ్యాంకు సేవలు ఇంకొంత ప్రజలకు తీసుకోవడానికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న డిసిసిబి బ్యాంక్ మేనేజర్ నారాయణరెడ్డి



ఉమా మహేశ్వర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న వైసిపి నాయకులు

ఉప సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి -చిట్వేలి

మండల పరిధిలోని చిట్వేలి ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి 53వ జన్మదిన వేడుకలు అభిమానులు, వైసిపి నాయకులు గ్రామ పంచాయతీ కార్యా లయ ఆవరణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిట్వేలి గ్రామంలో ప్రజలఅందరికీ అందుబాటులో ఉంటూ ఆపదలో ఉన్న వారికి అన్న అంటే పలికే సౌమ్యుడని, ప్రజా సేవలో ముందుంటారని కొనియాడారు. పేదలకు, పారిశుధ్య కార్మికులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లింగం లక్ష్మీకర్, ఉమ్మడి సుబ్రహ్మణ్యం రెడ్డి, మనీ, హజరత్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపిపై ఆరోపణలు చేయడం సరికాదు

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ సర్పంచు ఎన్నికపై టిడిపి నాయకులు వైసిపిపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని రాయలసీమ కాపునాడు యవజన సంఘం అధ్యక్షుడు కావలి కృష్ణతేజ అన్నారు. ఆదివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ పత్రంలో ఓటరు జాబితాలో ఉన్న సీరియల్ నెంబర్ కాకుండా తప్పుగా వేసి నామినేషన్ చెల్లకుండా టిడిపి వారే చేసుకున్నారని అన్నారు. అవకాశం ఉన్న వాటిపై దృష్టి పెట్టకుండా వైసిపిని తిట్టేందుకే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. వైసిపిని గెలవకుండా చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. వార్డు మెంబరుకు నామినేషన్‌కు వేయడానికి టిడిపి వారికి కార్యకర్త దొరక్కపోవడంతో సర్పంచుకు మాత్రమే నామినేషన్ వేశారని అన్నారు. సమావేశంలో ఇడుపులపాయ వైసిపి నాయకులు పుల్లయ్య, హరి, గోపి, శ్రావణ్ పాల్గొన్నారు.



నామట్టి నా దేశం కార్యక్రమంలో ఎన్‌సిసి విద్యార్థులు

ఘనంగా నా మట్టి..నాదేశం

ప్రజాశక్తి-చిట్వేలు

మండల పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి విద్యార్థులకు మేరీ మిట్టి మేరా దేశ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75వ స్వాతంత్రం దినోత్సవం సందర్భంగా ఆజాదీక అమృత మహోత్సవాలను విజయవంతంగా ముగించుకొని,76వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా దేశ మంతా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అమరవీరుల జ్ఞాపకార్థం ప్రతి గ్రామ స్థాయిలలో స్మారకాలు ఏర్పాటు చేస్తున్నామని, అమృత కలశ యాత్ర పేరుతో దేశమంతటా వివిధ ప్రాంతాల నుంచి 7500 కలశాలలో పవిత్ర మట్టిని, మొక్కలను సేకరించి, ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం సమీపంలో అమృత వాటికను నిర్మించి మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గరాజు, వాచ్మెన్ వెంకటరెడ్డి, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లెలో మారెమ్మ జాతర

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్‌పంచాయతీ అరవపల్లిలో ముత్తు మారెమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వేప మండలు కట్టి పొంగళ్లను అమ్మవారికి సమర్పించుకున్నారు. జాతరకు వచ్చిన ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సేలం చంద్రశేఖర్, స్థానిక నాయకులు సేలం సుధాకర్ బాబు, శ్రీరామ్ కిరణ్ కుమార్, ముమ్మడిశెట్టి సుధాకర్ సురేష్ బాబు, నడివీధి సుధాకర్, గుణయాదవ్, ఒర్స్ శ్రీను, పల్లెగ్రిష్మంత్‌రెడ్డి, చలపతి, అఖిల్, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి పంటను నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్‌లో సాగయ్యే పంటలకు తప్పనిసరిగా ఇ క్రాప్ చేయించాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ తెలిపారు. ప్రతి రైతు తన పొలంలో పంట సాగు చేసిన వెంటనే తమ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులకు తెలిపి పంట నమోదు చేయించుకోవాలనన్నారు. పంట నమోదు చేయించుకోవడం వలన రైతులు పంట భీమా, పంట మద్దతు ధర , ఇన్ పుట్ సబ్సిడీ, రైతు భరోసా వంటి పథకాలకు అర్హులవుతారని చెప్పారు. కావున ప్రతి గ్రామంలో రైతులు పంట నమోదు చేయించుకోవాలని ఆమె సూచించారు. గతంలో సాగు చేసిన పంటలు తుఫాను తాకిడికి దెబ్బతిన్నప్పటికీ రైతులు ఇ క్రాప్ నమోదు చేసుకోవడంతో నష్ట పరిహారం మంజూరైందన్నారు.

క్రైం కార్నర్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ సురేష్‌కుమార్

ఎటిఎం దొంగ అరెస్టు

ప్రజాశక్తి-కలికిరి

ఎటిఎం సెంటర్ల దగ్గర డబ్బులు కాజేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వాల్మీకిపురం సిఐ పి.సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ మాట్లాడుతూ నాలుగు రోజులు క్రితం కలికిరి క్రాస్‌రోడ్ ఎటిఎం వద్ద ఇద్దరు వృద్ధులు డబ్బులు తీసుకుంటున్న సమయంలో సదుం మండలం బత్తలవారిపల్లి కు చెందిన ఆటో డ్రైవర్ చింతల మోహన్(28) వారిని ఏమార్చి వారి దగ్గర నుండి ఎటిఎం దొంగిలించి వారి అకౌంట్లో ఉన్న నగదును తీసేవాడని చెప్పారు. బాధితులు కలికిరి పోలీస్ స్టేషన్ ఆశ్రయించగా ఎస్ఐ రహిమల్ల ఆదేశాల మేరకు ఏఎస్ఐ మధుసూదనాచారి కేసు నమోదు చేశారని చెప్పారు. తమ సిబ్బందితో కలికిరిలో తనిఖీ నిర్వహిస్తుండగా శనివారం మధ్యాహ్నం కలకడ రోడ్డు లోని సాయిబాలాజీ కాలనీ సమీపంలో ఆటోలో అనుమానంగా ఉన్న వ్యక్తిని విచారించగా నిందితుడిగా తేలడంతో అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.42 వేల రూపాయలు నగదు, ఆంధ్ర బ్యాంక్ ఎటిఎం కార్డు, ఒక కీప్యాడ్, లావా ఫోను, వెండిచైన్లు రెండు బ్రాస్లెట్ రెండు, వెండి ఉంగరము, బంగారు చెవి పోగులు ఒక జత తో పాటు ఆటోను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు తెలిపారు. దొంగతనాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి అను మానం ఉన్న పోలీసులు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ మధుసూదనాచారి, హెడ్ కానిస్టేబుల్ మనోహర, మహమ్మద్ అలీ, పిసిలు మునిరత్నం, అమర్‌నాథ్‌లు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

ఓ పథకం ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయురాలి ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు పీలేరు అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో సిఐ మాట్లాడుతూ వివరాల మేరకు పట్టణంలోని అయ్యప్పరెడ్డికాలనీలో నివాసముంటున్న వసంతకుమారి ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుందని, ఆమె భర్త పక్షవాతంతో బాధపడుతూ, మాటలు కూడా రాని స్థితిలో మంచం పట్టి ఉన్నాడని చెప్పారు. ఇటీవల ఉపాధ్యాయురాలి ఇంటికి శిరీష అనే అమ్మాయి వచ్చి తనకు టిసి కావాలని కోరడంతో, ఉపాధ్యాయుని ఇప్పుడు కుదరదు తర్వాత రావాలని చెప్పడంతో శిరీష వెళ్ళిపోయిందన్నారు. ఆ సమయంలో ఉపాధ్యాయురాలి భర్త అనారోగ్య పరిస్థితిని సత్యసాయి జిల్లా, ధర్మవరంకు చెందిన శిరీష, అరుణమ్మ, హనుమంతు రెడ్డిలు పసిగట్టారని చెప్పారు. వారు మళ్లీ ఈనెల 11న ఉపాధ్యాయురాలి ఇంటికి వచ్చి తమను మేడం ఇంటిని శుభ్రం చేయడానికి పంపిందని ఉపాధ్యాయురాలి భర్తకు చెప్పి ఇంటిలోకి ప్రవేశించారని పేర్కొన్నారు. పడక గది తలుపులు మూసి కబోర్డులోని చేతి బ్యాగులో ఉన్న 108 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ.50 వేలు నగదు చోరీ చేసి అక్కడి నుంచి పరారయ్యారని తెలిపారు. విధుల నుంచి తిరిగి వచ్చిన ఉపాధ్యాయులు జరిగిన చోరీ విషయాన్ని గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఎస్ఐ నరసింహుడు, సిబ్బందితో చాకచక్యంగా చోరీకి పాల్పడిన వారిని పీలేరు రైల్వే స్టేషన్ ప్రాంతంలో అదుపులోని తీసుకుని, చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.



పట్టుబడిన నిందితులు, చోరీ సొత్తులు మీడియా ముందుంచిన పోలీసులు